విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర - పోలాకి : బాల్య దశ నుంచి సాగిన విద్య ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం మబగాం గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోజరిగిన విద్యార్థులకు పుస్తకాలు ఇతర సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్య అభివృద్ధి కోసం నూతన ఉమ్మడి ప్రభుత్వం పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. విద్యాభివృద్ధి కోసం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను నియమించి మరింత అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పార్టీ ప్రతినిధులు గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

సమాజ సేవలో సీనియర్ జర్నలిస్ట్

రక్తదానం చేసిన 'జై జయం శివశంకర్'

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : నిరంతరం వార్తా ప్రపంచంలో ఉంటూ, సమాజానికి సేవ చెయ్యాలనే ఆశయంతో తన జన్మదినాన రక్తదానం చెయ్యటం హర్షణీయమని, పలువురు జర్నలిస్ట్‌లతోపాటు సామాజిక సేవకులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థలలో సభ్యులుగా సేవలందిస్తున్న ఉర్లం. శివతేజ అన్నారు. ఈ సందర్భంగా శివతేజ మాట్లాడుతూ తోటి జర్నలిస్ట్ గా వార్తా ప్రపంచం కష్టాలు మాకు తెలుసని, సమాజానికి జర్నలిస్ట్ ఒక వెన్నుముఖని, ఈ రోజు అందరికీ అతిచేరువగా వార్తలను అందించటంలో పత్రికాప్రతినిధుల పాత్ర చాలా కీలకమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా జర్నలిజంలో ముద్రవేసిన జై జయం అధినేత, ప్రెస్ క్లబ్బుబ్ అధ్యక్ష్యులు కొంక్యాన. వేణుగోపాల్ అడుగు జాడల్లో నడుస్తూ, ఎక్కడా ఒక మచ్చ లేకుండా సమాజానికి ఉపయోగపడే వార్తలను అందించటమే కాకుండా, ప్రజాసమస్యలను స్థానిక అధికారులకు చేరవేస్తూ తత్వర పరిస్కార ధ్యేయంగా సేవలందిస్తున్న కొంక్యాన శంకర్ కోసం ఎంతచెప్పినా తక్కువేనన్నారు. బుధవారం శంకర్ జన్మదినం సందర్భంగా స్థానిక న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకులో రక్తదానం చెయ్యటం అభినందనీయమని, తోటి జర్నలిస్ట్ గా గర్వపడుతున్నానన్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్ట్ సంఘాలు శివశంకర్ కుఅభినందనలు తెలిపారు.

ఇండోర్ స్టేడియంను పరిశీలించిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్

విశాలాంధ్ర - రణస్థలం : క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రణస్థలం మండల కొండములగాం సమీపంలో ఉన్న ఇండోర్ స్టేడియంను ఆకస్మితింగా స్థానిక శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) పరిశీలించారు. స్టేడియం నుండి కొండములగం ఆర్ అండ్ బి రోడ్డు నుండి స్టేడియం కు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో క్రీడాకారులు, స్థానికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా రోడ్డు పక్కన మురుగునీరు కొండ నుండి వచ్చే వర్షం నీరు వల్ల ఈ రహదారి పూర్తిగా కనీసం స్టేడియం కు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యలను స్థానికులు, క్రీడాకారులు ఎమ్మెల్యే ఎన్ఇఆర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన స్వయంగా బుధవారం పరిశీలించారు. రోడ్డుకు అవసరమైన మరమతులను సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కూడా పరిశీలించారు. ఆయన వెంట కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీకి వెళ్లే రహదారి ఆక్రమణలు తొలగించాలి

బీజేపీ అధ్యక్షులు పొందర దుదిష్టి పాత్రో

విశాలాంధ్ర - మందస : మండల కేంద్రం మందస బస్ స్టాండ్ నుంచి పంచాయతీ కార్యాలయం మీదుగా జిల్లుండ కు వెళ్లే రహదారి నిత్యం ట్రాఫిక్ రద్దీ ఎదుర్కొంటుందని, రహదారిలో ఆక్రమణలు జరిగాయని ఈ సమస్యను పలాస ఎంఎల్ఏ గౌతు శిరీష దృష్టికి తీసుకువెళ్తానని బి.జె.పి మండల పార్టీ అధ్యక్షులు పొందర దుదిష్టి పాత్రో తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ రహదారి వెంబడి సుమారు 6 గ్రామాలకు రహదారి ఉండడంతో పాటు పట్టణంలోని ప్రధాన దేవాలయం లకు కూడా ఈ రహదారి ప్రధాన రహదారన్నారు. అయితే ఈ రహదారి వెంబడి ఆక్రమణ లు జరగటం తో పాటు ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్, మద్యం షాప్ ఉండటం తో నిత్యం ట్రాఫిక్ సమస్య తో పాటు రద్దీ ఏర్పడి స్థానికులు తీవ్ర ఇక్కట్లు గురవుతున్నారన్నారు. ప్రధానంగా మహిళలు ఈ రహదారి వెంబడి వెళ్లేందుకు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి వెంబడి ఆక్రమణలు తొలగించాలని, మద్యం షాప్‌ను ఎత్తివేయాలని కోరారు.

సకాలంలో జీతాలు, పింఛన్లపై విశ్రాంత ఉద్యోగుల సంఘం హర్షం

విశాలాంధ్ర - పొందూరు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు సకాలంలో జీతాలు, పింఛన్లు జమకావడం పట్ల జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో కీలక భూమికను నిర్వర్తిస్తున్న ఉద్యోగ వర్గాలతో పాటు, మూడు నుంచి నాలుగు దశాబ్దాల పాటు సేవలందించి పదవీవిరమణ చేసిన పెన్షనర్ల పట్ల కొత్త ప్రభుత్వం సానుకూల దృక్పథాన్ని ప్రదర్శిస్తోందని చెప్పడానికి శుభ సంకేతంగా భావించవచ్చని పేర్కొన్నారు. ఇక ముందు కూడా ఇదే మార్గంలో అన్ని విషయాల్లో ఈ వర్గాల అభిమానాన్ని ప్రభుత్వం చూరగొనగలదన్న ఆశాభావాన్ని ధర్మారావు వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలిపారు.

ఓంకార్ కుటుంబాన్ని మాజీ మంత్రి పరామర్శ

విశాలాంధ్ర - పలాస : పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు బత్తిన ఓంకార్ గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బుధవారం మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, మాజీ సర్పంచ్ తెప్పల అప్పలస్వామి, రాపాక చిన్నారావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశవరావు తదితరులు ఉన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - సంతబొమ్మాలి : ఈ మండలం బోరుభద్ర సచివాలయం పరిధిలోగల రైతులకు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పిని వెంకటేష్, మాజీ ఎంపీటీసీ వజ్జ ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో బుధవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలుగుదేశం ప్రభుత్వము హయాంలో రైతులకు స్వర్ణ యుగమని, రైతులు ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, రైతులు పాల్గొన్నారు.

ఎంపి కలిశెట్టికి కృతజ్ఞతలు

యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు చౌదరి

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ఈనాడులో గ్రామీణ విలేఖరిగా ప్రస్థానం ఆరంభించి నేడు లోక్‌సభ సభ్యునిగా ఎన్నికై తనదైన శైలిలో సమస్యలను ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకొని వెళుతున్నారని అందులో భాగంగానే ప్రభుత్వ గుర్తింపు పొందిన విలేకరులకు టోల్ గేట్ల వద్ద వసూలు చేసే రుసుము నుంచి మిన హాయింపు ఇవ్వాలని కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరికి వినతిపత్రం ద్వారా కోరడం గొప్ప విషయం అని ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ (యూజే ఎఫ్) శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు చౌదరి లక్ష్మణరావు అన్నారు. ప్రజల సమస్యలను వెలికితీసి పరిష్కారం కోసం పాటుపడే విలేఖరుల సమస్యలను ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లడం ఎంపి అంకితభావానికి నిదర్శనం అన్నారు.

బియ్యం పంపిణీ వాహనాలపై జగన్ ఫోటోలు తీయరా

మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి

విశాలాంధ్ర - జలుమూరు : గత ప్రభుత్వం పేదలకు అందించే బియ్యం పంపిణీ చేసే వాహనాలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోటో ఆయన పార్టీ రంగులతో వాహనాలు ఉండేవని ఆయన ప్రభుత్వం పోయి పదవులు పోయిన నేటికీ ఆ వాహనాలపై జగన్ ఫోటోలు ఉండడం దురదృష్టకరమని సారవకోట మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ అన్నారు. బుధవారం సారవకోట మండలం బుడితి గ్రామంలో యధావిధిగా అదే వాహనంపై బియ్యాన్ని పంపిణీ చేయడం ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా ఇటువంటి వాహనాలను సీజ్ చేయాలని ఆయన అధికారులను కోరారు.

చెట్ల పెంపకంతో మనిషి మనుగడ : జిల్లా ఉద్యానశాఖ అధికారి రత్నాల

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ప్రకృతి అందాలను కాపాడేందుకు వృక్షాలు ఎంతగానో దోహదపడతాయని, మనిషి మనుగడకు చెట్లు ఎంతో ఉపయోగకరం అని శ్రీకాకుళం జిల్లా ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు రత్నాలవెంకటవర ప్రసాద్ అన్నారు. బుధవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు గేదెల ఇందిరా ప్రసాద్, గాయకులు డాక్టర్ మంతెన వాసుదేవాచారిల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. చెట్లు వాయు కాలుష్యాన్ని నివారిస్తాయని, వన్య ప్రాణులకు ఆవాసాలు కల్పిస్తాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో హరిత వనాల పెంపకానికి వివిధ అనుబంధ శాఖల సహకారాన్ని తీసుకొని చర్యలు చేపట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కలిసి కట్టుగా ముందుకు రావాలని, మానవ మనుగడకు కీలకం వృక్షాలు అని అన్నారు. ప్రస్తుత ఆధునిక కాలంలో చెట్లుని నరకడం, కాలుష్యాన్ని వెదజెళ్ళడం వల్ల అనేక అనర్థాలకు దారి తీస్తుందన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ అభినందన సభలో పలువురు ప్రముఖులు సంఘ సేవకులు పాల్గొని సమాజానికి ఇందిరా ప్రసాద్ మరియు వాసుదేవాచారి లు అందించే సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పిజి గుప్తా, రాడ కైలాసరావు, బివి.రవిశంకర్, బి. దేవీ ప్రసాద్, బొడ్డేపల్లి ప్రసాద్ రావు, సింహాద్రి వేణుగోపాల్, గంజి ఎజ్రా, బరాటము శ్రీనివాస్, రామ్ బాయి, స్రవంతి, వాసంతి, గేదెల లక్ష్మీ, గొర్ల వాసుదేవరావు, ఎస్. సంజీవరావు, మలిపెద్ది మల్లిబాబు, గోలీ ఉమా మహేశ్వర రావు, సంతోష్ గురు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

దూసిలో కౌలు రైతులకు అవగాహన

విశాలాంధ్ర - ఆమదాలవలస : దూసి ఆర్‌బి కే పరిధిలోని కౌలు రైతు లు నమోదు మరియు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఎఫ్‌టిసిడిడి ఏ త్రినాధ స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రం కోసం దరఖాస్తు చేసుకోవలసి ఉందని వివరించారు. దరఖాస్తు చేసుకున్న రైతుకు గుర్తింపు కార్డు అందిస్తామన్నారు. ఏడిఏ బగ్గు రజిని మాట్లా డుతూ కార్డు ద్వారా పంట నష్ట పరి హారం, ఈ పంట నమోదు, పంట రుణాలు, అన్నదాత సుఖీభవ, పంట ల భీమా కొనుగోళ్లపై రాయితీ వ్యవ సాయ ఉత్పత్తులు అనగా విత్తనాలు ఎరువులు అండ్ పురుగు మందులు వంటివి పంపిణీ మొదలైన పథకాలు వర్తించ బడతా యన్నారు. అలాగే భూసార పరీక్షల గురించి వాటి ఫలి తాలను గురించి క్షుణ్ణంగా రైతులకు వివరించారు. ఏఏ ఎరువులు ఎంత మోతాదులో ఏ సమయంలో ఎలా వాడాలో తెలియజేశారు. ప్రస్తు త వ్యవసాయ సీజన్లో వరి పంటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధ తులపై రైతులకు అవగాహన కల్పిం చారు. అలాగే వరి పంటలో ఎద లలో చేపట్టవలసిన కలుపు యాజమాన్యం గురించి వివరించారు. భూసార పరీక్ష ఫలితాలను గూర్చి రైతులకు సూక్ష్మ పోషకాలు, బయో ఫెర్టిలైజర్ వాడకం పై అవగాహన కల్పించారు. విఏఏ టీ అలేఖ్య ఎరువులు పంపిణీ పలు విషయాల పై వివరించారు. దేశం పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ తమ్మినేని అప్పలనాయుడు ఏఈఓ, రమణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న

విశాలాంధ్ర - పొందూరు : గత ప్రభుత్వం అమలు చేసిన 117 జీవోను తక్షణమే రద్దు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న ప్రభుత్వాన్ని కోరారు. బుధ వారం సాయంత్రం లైదాం ప్రాధమి కోన్నత పాఠశాలలో జరిగిన పొందూరు మండల శాఖ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఈ జీవో కారణంగా రాష్ట్రంలో వేల సంఖ్యలో పాఠశాలలు మూత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. 12వ పిఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఉద్యోగులందరికీ మధ్యంతర భృతి 30శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. యాప్ ల భారం తగ్గించి ఉపాధ్యాయుల బోధనకు సమయం యివ్వాలని కోరారు. అక్రమ బదిలీలు రద్దు చేసి పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పొందూరు అధ్యక్షుడు బలివాడ వెంకటేశ్వర్లు, జిల్లా బాధ్యులు గురుగుబెల్లి గోపాలరావు, గండెం రామారావు, చౌదరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టూవీలర్ మెకానిక్స్ దినోత్సవం

విశాలాంధ్ర - కవిటి : ప్రపంచ టూవీలర్ మెకానిక్స్ దినోత్సవాన్ని కవిటిలో శ్రీ చింతామణి టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్ఛా పురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, కవిటి నాలుగు మండలాలలో ర్యాలీ నిర్వహించి అనంతరం శ్రీ చింతామణి అమ్మవారి దేవా లయంలో పూజలు చేశారు. కేకులు కట్ చేసి సంబ రాలు చేసుకున్నారు. మెకానిక్ కార్మికులు ఎదు ర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టూవీలర్ మెకానికులు కోరారు. టూవీలర్ మెకానిక్ లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చింతామణి టూవీలర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గురు సత్కారం గత జన్మ సుకృతం : హోం మంత్రి అనిత

విశాలాంధ్ర - జి.సిగడాం : గురువు నుంచి సత్కారం పొందడం గత జన్మ సుకృతంగా భావిస్తున్నట్లు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సంతోషం వ్యక్తం చేశారు. విశాఖ పట్నం లోని ఎం.వి.పి కాలనీలోని మంత్రి స్వగృహంలో ఆమెను విశ్రాంత స్కూల్ అసిస్టెంట్ వాండ్రంగి రామావతారం సత్కరించారు. దుశ్శాలువను కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మూడు దశాబ్దాల కితం ఉపాధ్యాయుడు రామావతారం ఇచ్ఛాపురం ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు అనిత అతని విద్యార్థిని, మాస్టారి ఇంటికి ట్యూషన్ కు కూడా వెళ్లేది, అప్పట్లోనే అనిత పాఠశాల విద్యార్థి నాయకురాలిగా (ఎస్.పి.ఎల్) ఉండేదని మాస్టారు చెప్పారు. అనిత తండ్రి అప్పారావు జూనియర్ లెక్చరర్‌గా ఇచ్ఛాపురంలో పనిచేశారు. కుమిలి ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ యు.మురళీధర్, వి.లంబోధరరావు, వి.అనీల్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ సూర శ్రీనివాసరావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఎస్ఎస్ఆర్ ఫౌండర్ డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. క్రమశిక్షణతో చదివితే లక్ష్యాలు చేరుకోవడం చాలా సులువు అని ఇంటర్మీడియట్ డిగ్రీలోనే మీ భవిష్యత్తుని నిర్ణయించుకోవడం జరుగు తుందని అన్నారు. శ్రీకాకుళం నగరంలో ప్రభుత్వ బిసి బాలికల కళాశాల వసతి గృహం - 4 విద్యార్థినిలకు ఫ్యాన్లు అందించారు. ఈ సందర్భంగా సూర శ్రీనివాస రావు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. మీరంతా భారతదేశ వనితలగా ఎదగాలని ఆకాంక్షి స్తున్నాను అన్నారు. మీరంతా ఎంత క్రమశిక్షణగా ఉన్న తీరు చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని అన్నారు. పరీక్షలు పెద్ద సమస్య కానేకాదని, ఆత్మవిశ్వాసంతో ఇష్టంతో చదివి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. చదువుల్లో భవిష్యత్తులో రాణించాలంటే సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పుష్పగుచ్ఛం అందించి దుస్సాలతో సత్కరించారు. ఫ్యాన్లు, లైట్లు వితరణ చేసినందుకు హాస్టల్ వార్డెన్ లలిత, విద్యార్థినిలు కృతజ్ఞతలు తెలియజేశారు.

మేనేజర్, ఫీల్డాఫీసర్‌లకు ఘన సన్మానం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఈ మండలము బోరుభద్ర గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ రాజేష్, ఫీల్డ్ ఆఫీసర్ రవి బదిలీపై వేరే శాఖకు వెళ్తున్న సందర్భంగా, బోరుభద్ర బ్యాంకు మిత్రాలు, విఓఏలు, వెలుగు సిబ్బంది సమక్షంలో ఘనంగా సన్మానం చేసారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - సోంపేట/కంచిలి : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసే దుస్తులు, బ్యాగులు, ఇతరత్రా సామా గ్రితో కూడిన కిట్లను బుధవారం కంచిలి మండలం ఎంఎస్‌పల్లి, డీజీపురం, సిర్తలి గ్రామాల్లో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్య క్రమాల్లో పాల్గొన్న టీడీపీ నేతలు మాదిన రామారావు, కురయ్య, చిన్నబాబు, పురుషోత్తం, కిషోర్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభు త్వ సేవలను వినియోగించుకుని చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు సప్పటి శివరాంప్రసాద్, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఏడు నుండి జగన్నాథ స్వామి ఉత్సవాలు



విశాలాంధ్ర - జలుమూరు : జలుమూరు మండ లం మర్రివలస పంచా యతీ బైరాగి పేట గ్రామంలో కొలువైయున్న శ్రీ జగన్నాథ స్వామి ఉత్సవాలను ఈ నెల ఏడు ఆషాడ శుద్ధ విద్య ఆదివారం మొదలవుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి వి ప్రభాకర్ రావు తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ స్వామివారికి ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పర్లాకిమిడి మహారాజా సమయం నుండి ఎక్కడ జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో పరిసర ప్రాంతాల నుండి వందల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శిస్తారని అర్చకులు కార్తీక్ దాస్ తెలిపారు. పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు.

వైద్య శిబిరం

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట సమీపంలో గల సీతయ్య ఫౌండేషన్ ఆశ్రమంలో నివాస ముంటున్న వృద్ధులు, వికలాంగులకు, అలాగే గిరిజన విద్యార్థులకు బుధవారం మాణిక్య పురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ మహంతి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వ హిం చారు. అందరికీ వైద్య తనిఖీలు చేపట్టి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు గుల్ల మోహనరావు, రమేష్ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని శోభారాణి

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన ఉండాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని శోభారాణి తెలిపారు. నగరంలోని బలగ సెక్టర్ పరిధిలోని హడ్కో కాలనీ పాఠశాలలో బుధవారం డయేరియా పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, సురక్షితమైన తాగునీటిని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇళ్ల పరిసరాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, ప్రతిరోజు చేతులను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. నిల్వ ఆహార పదార్థాలను భుజించవద్దని, వేడివేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. జ్వరం, తీవ్రమైన అలసట, తలనొప్పి, వాంతులు, విరోచనాలు వంటివి వస్తే సొంత వైద్యం చేయించకుండా దగ్గరలోని వైద్యున్ని సకాలంలో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏవి మురళీకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ పి యశోద, మహిళా పోలీస్ ఎం హిమబిందు, ఏఎన్ఎం ఉష, ఆశ కళ్యాణి కృష్ణవేణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధన మదింపునకే టీచ్ టూల్

విశాలాంధ్ర - సోంపేట : ఉపాధ్యాయిని బోధనా పద్ధతిని ఒక నమూనాలో మదింపు చేయడానికే టీచ్ టూల్‌ను అభివృద్ధి చేసినట్టు సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్ సోంపేటలో జూలై 1 నుంచి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రధానో పాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సిఆర్ఎంటీలకు తొమ్మిది రోజుల పాటు నిర్వ హిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంకు మండల విద్యాశాఖాధికారులు జోరాడు, కృష్ణంరాజు పర్యవేక్షిస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పలాస, ఇచ్ఛా పురం నియోజకవర్గాలకు చెందిన పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు. డిఆర్‌పి బృందం కృషితో చక్కగా సాగుతున్న ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాట్లుపై ఎఎంఓ లక్ష్మీనారాయణ సంతృప్తి వ్యక్తం చేశారు.

చైనా బ్యాడ్మింటన్ వర్ధమాన క్రీడాకారుడు జాంగ్ జీజికు నివాళులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ప్రముఖ బ్యాడ్మింటన్ చైనా కీడాకారులు జాంగ్ జీజీ జూనియర్ బ్యాట్మెంటన్ ఛాంపి యన్షిప్లో, ఇండోనేషియాలో ఆడుతూ స్టేడియంలోనే కుప్పకూలుతూ మరణించడం యావత్ క్రీడా ప్రపంచం దిగ్భ్రాంతికి గురైంది. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ నటుకుల మోహన్, ప్రముఖ వైద్యులు బోడ్డేపల్లి సురేష్ లు ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా వారి కుటుంబానికి క్రీడా ప్రపంచం తరఫున ముఖ్యంగా శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ అధ్యక్షులు నక్క రామకృష్ణ, ఇండోర్ స్టేడియం ఇన్చార్జ్ డిల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు గణపతి రావు, కోశాధికారి గండేపల్లి జగన్నాథ రావు, కార్యవర్గ సభ్యులు నల్లబారిక శ్రీనివాసరావు, పిల్లలు, క్రీడాకారులు అందరూ పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

రైతుల సంక్షేమము తెలుగుదేశం ప్రభుత్వం ధ్యేయం

విశాలాంధ్ర - సంతబొమ్మాలి : రైతుల సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వం ధ్యేయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అప్పిని వెంకటేష్, మండల తెలుగు దేశం పార్టీ నాయకులు వజ్జ ప్రభాకర్ రావు అన్నారు. బుధ వారం సంతబొమ్మాలి మండలం బోరుభద్ర గ్రామంలో ఉన్న ఇసుకబంధ చెరువును అధుని కరణ పనులు జరిపేందుకు పూజలు నిర్వహించారు. పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇసుకబంధ చెరువు వలన గ్రామస్తులకు, రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు రాష్ట్ర క్యాబినెట్ మంత్రి కింజరాపు అచ్చంనాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో నష్టపోయాం

మంత్రి అచ్చెన్న వద్ద మొరపెట్టుకున్న ఉద్యోగులు

విశాలాంధ్ర - నందిగాం : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జీతం తగ్గించి ఉద్యోగ భద్రత లేకుండా చేశారని కాంట్రాక్టర్ వ్యవసాయ ఉద్యోగులు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు నాయుడు ముందు మొరపెట్టుకున్నారు. బుధవారం నిమ్మాడలోని ఆయన ఛాంబర్‌లో కాంట్రాక్టు వ్యవసాయ ఉద్యోగులు కలిశారు. 2017లో టిడిపి ప్రభుత్వం హయాంలో కాంట్రాక్ట్ పద్ధతిలో వ్యవసాయ శాఖలో నియమించి ఎనిమిది వేల జీతం తరువాత 12 వేలకు పెంచి ఇన్సెంటివ్తో రూ. 15 వేలు ఇచ్చేవారు. తరువాత ప్రభుత్వం మారడంతో కేవలం టిడిపి హయాంలో ఉద్యోగాలు ఇచ్చారనే కారణంతో 12వేలకు కోతపెట్టారు. అలాగే మమ్మల్ని ఆర్బికేలకు అనుసంధానం చేసి విఏఏలను లేని చోట విధులు నిర్వహించమని చెప్పి వాళ్ళ పని మాకు చేయమన్నారని మంత్రికి తెలిపారు. వీఏఏలకు రూ.30 వేలు జీతం ఇచ్చి మాకు కేవలం రూ.12వేలు జీతం ఇస్తున్నారని తెలిపారు. మాకు శాలరీ పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రిని కోరారు.